నవ్వుల పాపాయి కోసం



క్షేత్రస్థాయి ప్రజలతో మమేకమయ్యే సిబ్బందికి పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

- కట్టుదిట్టంగా పీసీపీఎన్‌డీటీ తనిఖీలు
- ఏడాదిగా నమోదు కాని గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్ట అతిక్రమణ కేసులు
- సత్ఫలితాలిస్తున్న అధికారులు, సిబ్బంది కృషి

కాకినాడ క్రైం: మహిళ గర్భం దాల్చడం పాపం పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని ఒకటే చర్చ. కుటుంబాల్లో ఇలాంటి చర్చలు ఒకడుగు ముందుకేసి ఆడపిల్ల పుట్టుకపై ద్వేషాన్ని పెంచేవి. నవమాసాలు, మోసి, కని, పెంచిన తల్లికి మాతృత్వపు మమకారం దక్కకుండా, కడుపుకోత కోసి అంపశయ్యకి సాగనంపిన ఆడ శిశువుల ఉదంతాలు ఎన్నెన్నో. స్కానింగ్ ద్వారా పుట్టబోయేది ఆడో మగో తెలుసుకొని అప్పుడే ఊపిరి పోసుకుంటున్న బొడ్డుతాడైనా తెగని రక్తపు ముద్దపై ఇంటిల్లిపాదీ కత్తులు నూరేవారు. తల్లిదే బాధ్యతన్నట్లు చిత్రహింసలకు గురిచేసేవారు. చివరికి ఆడశిశువని తెలిసి పుట్టక ముందే చంపేసేవారు. ఇటువంటి ఉదంతాలు నేటికీ కొనసాగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. కఠిన చట్టాలు చేసినా అమలు మాత్రం అటకెక్కేది. అందుకు భిన్నంగా, చట్టాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తే ఎటువంటి సత్ఫలితాలు వస్తాయో కాకినాడ వైద్యాధికారులు రుజువు చేశారు. ఏడాది కాలంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని అతిక్రమించిన ఒక్క కేసు నమోదు కాకపోవడం విశేషం. అందుకు సంబంధిత విభాగం క్రియాశీలకంగా వ్యవహరించింది, అధికారుల నిరంతరం పర్యవేక్షణ, నివారణ, నియంత్రణ చర్యలు, అన్నింటికంటే ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది పడిన కష్టం కలగలిపి కాకినాడకు ఉత్తమ ఫలితాలనందించాయి.

ఇలా సుసాధ్యం

గడచిన ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెల మధ్య వరకు ఏడాది వ్యవధిలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం. ఇందుకు ప్రత్యేక కారచరణకు రూపకల్పన చేసి అమలు చేసినట్లు డెమో ప్రసాద్ రాజు తెలిపారు.

- డెకాయ్ ఆపరేషన్లు
- ఆకస్మిక తనిఖీలు
- అబార్షన్లు ఎక్కువ అవుతున్న ప్రాంతాల్లో నిఘా
- ఏఎన్‌ఎంలు సహా హెల్త్ ఎడ్యుకేటర్లు, పారామెడికల్, మెడికల్ సిబ్బందితో అవగాహన
- గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసి పట్టుబడిన వారిపై కఠిన చర్యలు
- స్కానింగ్ కేంద్రాల సిబ్బందికి శిక్షణ
- పీసీ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు, పోస్టర్లు
- స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణను పరోక్షంగా వెల్లడించేందుకు ఏర్పాటు చేసే మగ, ఆడ దేవుళ్ల ఫోటోలు తొలగింపు.

వీరి కృషితోనే...

కాకినాడ డివిజన్ పరిధిలో ఉన్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో డీఐవో డాక్టర్ సుబ్బరాజు నోడల్ అధికారిగా డెమో ప్రసాద్ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, లీగల్ కన్సల్టెంట్ ఎల్.శృతి, డీఈవో కృష్ణలు డివిజన్ నుంచి రాష్ట్రానికి అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలోనే గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా కొనసాగుతోంది. ఏఎన్‌ఎం, పోలీస్ సహా ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆసక్తికరంగా డెకాయ్ ఆపరేషన్లు

డెకాయ్ ఆపరేషన్లు ఓ థ్రిల్లర్ చిత్రాన్ని తలపించేలా ఉంటాయి. గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్లను గుర్తించడమే వీటి లక్ష్యం. ఏడాది కాలంలో కాకినాడ పరిధిలో మొత్తం 40 డెకాయ్ ఆపరేషన్లు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఓ గర్భిణికి హిడెన్ కేమెరా తగిలించి స్కానింగ్ కేంద్రానికి పంపుతారు. అలా వెళ్లిన మహిళకు రూ.1500 చెల్లిస్తారు. ఆమె రేడియాలజిస్టు వద్దకు వెళ్లి తనకు ముందు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారనీ, మరోమారు ఆడపిల్ల పుట్టడం తనకి ఇష్టం లేదనీ, స్కాన్ చేసి పుట్టబోయేది ఆడో, మగో చెప్పాలని, డబ్బులు ఎంతైనా ఫర్వాలేదని చెప్పిస్తారు. ఆమెతో పాటు గర్భిణి చుట్టంగా చెబుతూ ఓ ఏఎన్‌ఎం చాంబర్‌లోకి వెళతారు. ఆమె కూడా ఆఫర్ చేస్తారు. ఈ తంతు అంతా కెమేరాలో రికార్డు అవుతుంది. ఒప్పుకుంటే పట్టుబడ్డట్లే. అలా దొరికితే వెంటనే స్కానింగ్ కేంద్రం బయట మఫ్టీలో ఉన్న పోలీస్ రంగ ప్రవేశం చేసి అదుపులోకి తీసుకుంటారు.

లక్ష్య సాధన నూరుశాతం



గర్భస్థ శిశు లింగ నిర్ధారణ మార్గదర్శకాలు అమలు చేయడంలో నూరు శాతం లక్ష్యాన్ని సాధించాం. అధికారులు, సిబ్బందికి అభినందనలు. చట్టాన్ని ఉల్లంఘించే వారికి గరిష్టంగా 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు, జరిమానా ఉంటాయి. రెండోసారి చేసి పట్టుబడితే జైలు, జరిమానాతో పాటు స్కానింగ్ కేంద్రం అనుమతులు రద్దు చేస్తారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365కు ఫోన్ చేసి చెప్పాలి. వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. అలాగే స్కాన్ సెంటర్లు మగ పిల్లల బొమ్మలతో యాడ్‌లు ఇవ్వకూడదు. ప్రతి సెంటర్‌లోనూ రేడియాలజిస్టు, గైనికాలజిస్టు తప్పనిసరి.

– డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ

అంకెల్లో ఇలా..

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు	158
కాకినాడ డివిజన్‌లో స్కానింగ్ కేంద్రాలు	118
కాకినాడలో ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు	11
ఏడాది కాలంలో చేసిన డెకాయ్ ఆపరేషన్లు	11
ఏడాది కాలంలో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లు	40
ఆకస్మిక తనిఖీలు	348



స్థానిక లైఫ్‌లైన్ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డీఐవో డాక్టర్ సుబ్బరాజు

క్లుప్తంగా

27న కాకినాడ రూరల్ ఎంపీపీ ఎన్నిక

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) ఎన్నిక ఈ నెల 27న జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో పి.సతీష్ బుధవారం రాత్రి తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన గోపిశెట్టి పద్మజ సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆమె ఎంపీపీ పదవికి రాజీనామా చేసి ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీగా ఉన్న బందిల విరిషాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు 15 స్థానాలు వైఎస్సార్ సీపీ చెందిన సభ్యులవే. మిగిలిన మూడు జనసేనవి.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: మహిళల్లో రక్తహీనత, విటమిన్ల లోపం ఎక్కువగా కనిపిస్తోందని, ఆరోగ్య పరిరక్షణకు వారు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల భీమాబాయి మహిళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక శక్తి కోల్పోయిన 35 మంది మహిళలకు పౌష్టికాహార కిట్లను ఎంపీడీఓ అందజేశారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, మండల భీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వి.నందివర్ధన, ప్రతినిధులు లోవకుమారి, చంద్రకళ, మాచర్రావు, ఆదినారాయణ, అర్జునరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.2 లక్షల చేయూత



రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ చారిట్రబుల్ ట్రస్ట్ (1978) ద్వారా విద్య, వైద్య సాయంతో పాటు సామాజిక సేవ చేస్తున్నామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. దేవాలయం వీధిలోని కార్యాలయంలో బుధవారం నలుగురు పేద విద్యార్థులకు రూ.లక్ష ఉపకార వేతనం, భద్రాచలం వృద్ధాశ్రమానికి రూ.లక్ష సైకియాట్రిస్ట్ గొర్తి సుబ్బారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి జగన్నాథరావు, సభ్యులు సీమకుర్తి పాపారావు, బోడా ఆనంద్, రామ్‌చరణ్, పద్మనాభం పాల్గొన్నారు.

స్కిల్ కెరీర్‌పై అవగాహన



జర్మనీలో ఉపాధి అవకాశాలను వివరిస్తున్న డైరెక్టర్ సుగుణారెడ్డి

బాలాజీచెరువు: ఆదిత్య నర్సింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ నైపుణ్య అవగాహన సదస్సు జరిగింది. జర్మనీలో లభించే ఉద్యోగ అవకాశాలు, వాటికి అవసరమైన నైపుణ్య శిక్షణ తదితర విషయాలను జర్మనీ క్లయింట్ మిస్ విక్టోరియా వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా జర్మనీలో భాష శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించే విషయాలను కళాశాల డైరెక్టర్ సుగుణారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఉజ్వల, స్కిల్ ఏడీ నేహా, కళాశాల ఏడీఉస్‌డీఏ కొత్తల యశోదాకృష్ణ, ఎంప్లాయిమెంట్ ట్రైనర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2015–19 వరకు చదువుకున్న బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలన్నారు. విద్యార్థినులు కళాశాల వెబ్‌సైట్‌లో ఫీజులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలకు ఈనెల 28వ తేదీలోగా రుసుము చెల్లించాలన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు హుండీల లెక్కింపు

సామర్లకోట: స్థానిక పంచారామక్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో శివరాత్రి నుంచి ఆలయం లోని హుండీల ద్వారా ఆదాయం తెలుసుకోవడానికి లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ చెప్పారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, భక్త కమిటీ సభ్యులు హుండీల లెక్కింపులో పాల్గొని సేవలందించనున్నారు.

బూత్ కమిటీలను నియమించాలి



సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: బూత్, మండల కమిటీల నియామకం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం నగరంలోని బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నగరపాలకసంస్థ ఎన్నికలు త్వరలో జరగునున్నాయని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఇటీవల మృతిచెందిన బీజేపీ సీనియర్ నాయకులు నేతి గోపాలకృష్ణ చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు బుధవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. గుర్తింపు కార్డులు కావాల్సినవారు జిల్లా వికలాంగుల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, బీజేపీ నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం, మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, చోడిశెట్టి రమేష్‌బాబు, కవికొండల చలపతి పాల్గొన్నారు.

హిందువులు సంఘటితంగా ఉండాలి



సమావేశంలో మాట్లాతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్

బోట్‌క్లబ్: హిందువులు సంఘటితంగా ఉంటే అనుకున్నది సాధించవచ్చునని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు ఆర్.రవిశంకర్ పట్నాయక్ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. రానున్న ఉగాది నుంచి హనుమజ్జయంతి వరకూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రామోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరిషత్ నిర్వహించే శిక్షణకు కార్యకర్తలు విధిగా హాజరుకావాలన్నారు. అనంతరం పరిషత్‌లో పలువురి పదవుల్లో మార్పులు చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ, కోశాధికారిగా జి.ఉదయ భానోజీరావు, జిల్లా సంస్కృత విభాగ ప్రముఖ్‌గా చల్లా శ్రీకృష్ణవాణి, జిల్లా ఉపాధ్యక్షుడిగా కోక మాలతీదేవి, జిల్లా మాతృశక్తి విభాగ్ ప్రముఖ్‌గా గ్రంధి నాగమణి, సంయుక్త కార్యదర్శిగా సాయి కిశోర్‌ను నియమించినట్లు చెప్పారు.

మెస్ టెండర్లపై పోస్టల్ ఉద్యమం



సామర్లకోట హెడ్ పోస్టాఫీసు వద్ద మెస్ టెండర్ వివాదంపై ధర్నా

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలోని మెస్ టెండర్ అంశం పోస్టల్ ఉద్యమానికి దారితీసింది. ఈటీసీలో మెస్ నిర్వహణకు మంగళవారంతో టెండర్లకు గడువు ముగియడం, తరువాత కూడా ప్రిన్సిపాల్ రాకపోవడంతో వాటిని తెరవకుండా వాయిదా వేయడం తెలిసిందే. ఎమ్మెల్యే సిఫారసుతోనే బాక్సు తెరవలేదని ఆరోపిస్తూ ఇప్పటి వరకు మెస్‌ను నిర్వహిస్తున్న కుక్కల అప్పారావు పలువురు దళిత నాయకుల అండతో ఈటీసీ వద్ద మంగళవారం ఆందోళనకు సైతం దిగారు. తాజాగా బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో టెండర్ వాయిదా అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి, రాష్ట్ర గవర్నర్, జిల్లా కలెక్టరుకు రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదులను పోస్టు చేశాడు. ఈ సందర్భంగా అతడు పోస్టాఫీసు వద్ద నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించాలని ధర్నా చేశాడు.

శాసనసభను సందర్శించిన నన్నయ విద్యార్థులు



శాసనసభను సందర్శించిన విద్యార్థులు

కాకినాడ రూరల్: అమరావతిలోని రాష్ట్ర శాసనసభను, శాసన మండలిని స్థానిక నన్నయ వర్సిటీ ఎంఎస్‌ఎన్ క్యాంపస్‌లోని పొలిటికల్ సైన్స్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్ ఆధ్వర్యాన రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాలను విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.ప్రశాంతిశ్రీ, అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఎం పోచయ్య విభాగ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. ఈ విజ్ఞానయాత్రలో విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పాడా పీడీ చైత్ర వర్షిణి

పిఠాపురం: నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పాడా పీడీ చైత్ర వర్షిణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి పనుల కింద నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. తొలుత ఆమె కొత్తపల్లి మండలం రమణక్కపేటలో నిర్మిస్తున్న హైస్కూల్ ప్రహరీ గోడ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పనులు చేస్తున్న వారితో మాట్లాడి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె మూలపేట, చిత్రాడలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె వెంట ఏపీడీ పి.వసంత మాధవి, కాకినాడ డీఎల్‌పీవో పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదంపై నిరసన

- గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన మాల మహానాడు నాయకులు

సామర్లకోట: మాలలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాల మహానాడు నాయకులు హెచ్చరించారు. వర్గీకరణను నిరసిస్తూ రాష్ట్ర మాల మహానాడు పిలుపు మేరకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇంటి ముట్టడికి సిద్ధమైన ఆ వర్గం నాయకులను బుధవారం తెల్లవారు జాము నుంచి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పట్టణ మాలమహానాడు నాయకుడు నేతల హరిబాబు, బీపల్లి పండులను హౌస్ అరెస్టులు చేశారు. కొందరు నాయకులు అచ్చంపేటలోని ఎమ్మెల్యే రాజప్ప ఇంటి వద్ద తమ నిరసనను తెలియజేయడానికి పాదయాత్రగా వెళ్తుండగా డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎస్సై మౌనిక వారిని వెనక్కు పంపారు. దీంతో వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ హక్కులు కాపాడాలని ధర్నా చేసి తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర మాల మహానాడు అధ్యక్షుడు లింగం శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బత్తిన అచ్చారావు, దళిత ప్రజా చైతన్య వ్యవస్థాపకుడు బుంగా సతీష్ మాట్లాడుతూ రాజ్యాంగపరమైన హక్కులను తప్పించి, ఎస్సీల ఐక్యతను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో దళిత యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కాకర ప్రసాద్, జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, నియోజకవర్గ నాయకులు పెయ్యల అరుణ్‌కుమార్, గొల్లపల్లి చక్రధర్ లింగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు సంతృప్తికరం

కలెక్టర్ షణ్మోహన్



వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు సంతృప్తినిచ్చాయని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. స్థానిక వాకలపూడిలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ హోమ్ ఫర్ సీనియర్ సిటిజన్ (ఓల్డేజ హోమ్)ను బుధవారం రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుతో కలసి ఆయన సందర్శించారు. సొసైటీ ద్వారా వృద్ధులకు అందిస్తున్న సదుపాయాలు, వసతులను రామారావు కలెక్టర్ షణ్మోహన్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వాత్సల్య హోమ్ ఫర్ సీనియర్ సిటిజన్ గదులను పరిశీలించి, వృద్ధులతో మాట్లాడారు. అనంతరం జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాంబమూర్తి నగర్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ అంధుల ఆశ్రమం, ప్రత్యామ్నాయ భవనాల పరిశీలనలో భాగంగా తిమ్మాపురంలోని రెడ్ క్రాస్ గ్రీన్ ఫీల్డ్ అంధుల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవో రామ్ గోపాల్, విభిన్న ప్రతిభావంతులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లు జీవితం మహా జ్వలితం

బోట్‌క్లబ్: భారత పౌరుల ప్రజాహిత అభ్యుదయ ప్రగతికి అంకితమై సామాజిక సంస్కరణలకు ఆదర్శ మహిళా శక్తిగా నిలిచిన మల్లు స్వరాజ్యం జీవితం మహోజ్వల నిఘంటువుగా నిలిచిందని పౌరసంక్షేమం సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్ రాజీవ్ గృహకల్ప వద్ద ఆమె వర్ధంతి సందర్భంగా బుధవారం స్వరాజ్యం చిత్రపటానికి వివేకా అభ్యుదయ మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన నివాళులర్పించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు ఆమె పోరాటం ఎందరికో స్ఫూర్తి అన్నారు. ఉమ్మడి ఆంధ్రాలో మద్య నిషేధం కోరుతూ అప్పటి సీఎం కోట్ల విజయ భాస్కరరెడ్డిని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేయకుండా అడ్డుకున్నారన్నారు. అదే సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యపాన నిషేధం అమలుకు హామీ ఇచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత ఎన్‌టీ రామారావును అదే వేదిక వద్ద గాంధీజీకి తొలి పూలమాల వేసేందుకు అంగీకరించారని, అనంతరం మద్యపాన నిషేధం అమలైందని రమణరాజు అన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వరలక్ష్మి, మంగాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణలో కూటమి కుట్ర

కరప: ఎస్సీ వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వం మాల సామాజికవర్గంపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం, మాలమహానాడు నాయకులు విమర్శించారు. కరపలో బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాల మహానాడు నాయకుడు మాతా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలు ఉన్న మాదిగ సామాజికవర్గానికి 6.5 శాతం, 35 లక్షలు ఉన్న మాలల సామాజిక వర్గానికి 7.5 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం కుట్ర కాదా అని ప్రశ్నించారు. రచయిత సవిలే రాజేష్ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరుగుతుంటే టీడీపీలోని మాల సామాజికవర్గ ఎమ్మెల్యేలు సైతం దీనిని స్వాగతించడం బాధాకరమన్నారు. 14 సంవత్సరాల కిందటి జనాభా లెక్కల ప్రాతిపదిక వర్గీకరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చిన్నం వెంకటేశ్వరరావు, గుబ్బల రామకృష్ణ, పత్తిపాటి బుల్లిరాజు తదితర అంబేడ్కర్ యువజన సేవా సంఘం, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

21న మినీ జాబ్ మేళా

పిఠాపురం: ఈ నెల 21వ తేదీన పిఠాపురం పాలిటెక్నిక్ కాలేజీలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టీమ్ లీజ్, పైటీఎం, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కంపెనీలు పాల్గొంటాయని వారు తెలిపారు. వీటిలో ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత ఉండి వయసు 19 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని వారు తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఎన్ఏబీయూఎన్‌వైఏఎం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో తమ వివరాలు అప్‌లోడ్ చేసి రిజిస్టర్ అవ్వాలన్నారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు అన్ని రకాల సర్టిఫికెట్లు జిరాక్సులు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

వాచ్‌మెన్ కుటుంబానికి చేయూత



వాచ్‌మెన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

పిఠాపురం: స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణమండపంలో 25 ఏళ్లుగా వాచ్‌మెన్‌గా సేవలందిస్తున్న వేణుం సత్యనారాయణ కుటుంబానికి క్లబ్ ప్రాంతీయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రూ.21,900 ఆర్థిక సాయం చేశారు. ఇటీవల ఆకస్మికంగా ఆయన మృతి చెందారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.అప్పారావు, వూటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు : డీఈఓ రమేష్

కొత్తపల్లి: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. మండలంలోని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాలైన స్థానిక జెడ్పీ బాలుర, బాలికల, వీవీఎస్ కళాశాల, మూలపేట జెడ్పీ పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 142 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయని, హిందీ పరీక్షకు 27,394 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 27,186 మంది హాజరై, 208 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సహాయాన్ని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షా కేంద్రాల్లోని సిబ్బంది సెల్ ఫోన్ వినియోగించడాన్ని నిషేధించినట్లు తెలిపారు. బుధవారం నాటి పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ తెలిపారు. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 983 మంది హాజరు కావాల్సి ఉండగా 976 మంది హాజరైనట్లు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో నిత్యాన్నదానం ప్రారంభం

పిఠాపురం: ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ ఆశీస్సులతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్య అన్నదానం ప్రారంభించడం హర్షణీయమని కొడా చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. బుధవారం పిఠాపురం పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు, రోగి సహాయకులకు నిత్యాన్నదానాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖర్‌తో కలసి ఆయన ప్రారంభించారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

డ్రైన్లు, కాలువలను శుభ్రం చేయించిన అధికారులు



నాగులాపల్లిలో డ్రైనేజీలలో పూడికను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలే లేవు. దీనిపై సాక్షి దినపత్రిలో బుధవారం పారిశుద్ధ్యం అధ్వానం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల విస్తరణ అధికారి కే.హరికృష్ణసత్యరెడ్డి స్పందించారు. పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలలోని పూడికను, ప్రధానరోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు స్పందించకపోవడమే కాకుండా అందుబాటులో లేకపోవడంతో పత్రికలో వచ్చిన కథనం మేరకు ఆయనకు మెమో జారీ చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని పలుమార్లు ఆయనను హెచ్చరించినట్టు తెలిపారు.